క్లుప్తంగా

ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఎంపిక



ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను ఎంపిక చేసిన ఉపాధ్యాయులు

నింద్ర: మండలంలోని కొప్పేడు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రశస్త యాప్ ద్వారా సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లల నమోదు కార్యక్రమం నిర్వహించారు. గురువారం ప్రత్యేక అవసరాల పిల్లల లక్ష్యాలను అనుగుణంగా యాప్‌లో పొందుపరచడం జరిగింది. మండలస్థాయిలో ప్రతి పాఠశాలలో నమోదు కార్యక్రమం ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా పర్యవేక్షకుడు ప్రభాకర్‌వర్మ ప్రారంభించారు. సహిత విద్య అనుసరించడానికి యాప్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సహిత్య ఉపాధ్యాయుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్‌ఏలు

కార్వేటినగరం: తహసీల్దార్ కార్యాలయాల్లో నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షుడు లోకనాథం డిమాండ్ చేశారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినీలుగా పని చేస్తున్న వారిని వీఆర్‌ఏలుగా గుర్తించాలని, అదేవిధంగా పేస్కేల్ అమలు చేయాలన్నారు. విద్యార్హత కలిగిన వారికి వీఆర్‌ఓలుగా, అటెండర్, వాచ్‌మెన్‌లుగా పదోన్నతి కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

దేశం కోసం త్యాగం చేయాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద

వెదురుకుప్పం: దేశం కోసం త్యాగం చేయాలని అప్పుడే దేశభక్తిని చాటుకున్న వాళ్లమవుతామని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. గురువారం మండలంలోని చవటగుంట డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని, అక్కడ మొక్కలు పెంచాలని సూచించారు. వాటి సంరక్షణ కూడా ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. దేశానికి సేవ చేసిన వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ అధికారి వెంకటేశ్, వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీవ వైవిధ్యంపై అవగాహన



జీవవైవిధ్యంపై వివరిస్తున్న సుధాకర్

పాలసముద్రం: ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థులు జీవ వైవిధ్యంపై అవగాహన పెంచుకోవాలని చిత్తూరు జన విజ్ఞాన వేదిక సుధాకర్ తెలిపారు. గురువారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం మనోహర్‌నాయుడు ఆధ్వర్యంలో పర్యావరణ విభాగంలో భాగంగా జన విజ్ఞానికలో జీవ వైవిధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన సుధాకర్ విద్యార్థులకు పలు అంశాల గురించి వివరించారు. అనంతరం సందేహాలను నివృత్తి చేస్తూ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

చేపల సొసైటీలో భాగస్వాములను చేయండి

తిరుపతి కల్చరల్: చేపలు పట్టుకుని జీవనం సాగిస్తున్న తమను చేపల సొసైటీలో భాగస్వాములను చేయాలని రేణిగుంట మండలం వెంకటాపురానికి చెందిన మత్స్యకారులు కోరారు. వారు గురువారం మత్స్యశాఖ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తమ గ్రామంలోని చెరువు సొసైటీలో 37 మంది సభ్యులకు స్థానం కల్పించాల్సి ఉండగా 10 మందికి మాత్రమే అవకాశం ఇచ్చారని తెలిపారు. మిగిలిన 27 మందికి అన్ని అర్హతలు ఉన్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. స్పందించిన ఆయన పరిశీలించి అర్హత ఉంటే అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వలసలు వెళ్లకుండా మీ ప్రాంతంలోనే చెరువు ఆధారంగా చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేతన్నకు చేయూత

దారాన్ని వడకడమే ఆధారంగా చేసుకుని నేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న కుటుంబాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొత్త వెలుగులు నింపుతున్నారు. ఆర్థికంగా ఆసరా లేక వదిలేసిన మగ్గాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఊపిరి పోస్తున్నారు. ఏడాదికి రూ .24 వేలు సాయం అందజేస్తూ చేనేత రంగంపై ఆధారపడిన వారికి చేయూతనిస్తున్నారు.

- చేనేతల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ నేతన్న నేస్తం
- ఇప్పటి వరకు ఐదు విడతల్లో జిల్లాలోని చేనేతలకు రూ.2.20 కోట్లు ఆర్థిక సాయం
- నేడు వెంకటగిరిలో బటన్ నొక్కి ప్రారంభించనున్న సీఎం జగన్
- జమ కానున్న ఐదో విడత నిధులు
- ఆనందంలో చేనేతలు



చీర నేస్తున్న బాలాజి

నగరి: చేనేత పరిశ్రమకు జవసత్వాలు ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని 2019 డిసెంబర్ 21 నుంచి ప్రారంభించింది. ఈ పథకం ప్రారంభమయ్యాక చేనేత కార్మికుల ఇంట మగ్గాల చప్పుళ్లు వినిపిస్తున్నాయి. కరోనా నియంత్రణకు లాక్ డౌన్‌తో అన్ని రంగాలతో పాటు చేనేత రంగం కూడా కుదేలైంది. ఆర్డర్లు లేకపోవడంతో నేతన్నలు నష్టపోయారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం చేనేత కార్మికులకు అండగా నిలిచింది. జిల్లాలో 325 మంది మగ్గాలు కలిగిన చేనేత కార్మికులు ఉండగా 1200 మంది ఈ వృత్తిపై పరోక్షంగా జీవనం కొనసాగిస్తున్నారు. జిల్లాలో 13 మండలాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. 10 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. గడచిన నాలుగేళ్లలో ఐదో విడత నేతన్న నేస్తం అందజేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి శుక్రవారం చేనేత కార్మికుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. ఐదు విడతల్లో ఒక్కో కుటుంబం రూ.1.20 లక్షల సాయం అందుకుంది. ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా 194 మంది చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అందనుంది. ఈ సాయంతో నేతన్నలు ఫెడల్ లూమ్స్, నూతన డిజైన్లు ఇచ్చే జక్కార్డ్‌లు, బాబిన్లు కొనుగోలు చేసుకుంటున్నారు. వారి వృత్తిని సాంకేతికంగా మార్పు చేసుకుని అభివృద్ధి పథంలో నడుస్తున్నారు. ఇదిగాక జిల్లాలో వయోవృద్ధాప్యం కారణంగా నేతను వదిలిపెట్టిన 3,256 మంది చేనేత కార్మికులకు వృద్ధాప్య పెన్షన్ రూ.2750 చొప్పున అందుతోంది.

టీడీపీ హయాంలో జీఓలకే పరిమితం

టీడీపీ ప్రభుత్వం చేనేతలను గాలికొదిలేసింది. సహకార రంగాన్నే పూర్తిగా దెబ్బతీయడంతో చేనేత కార్మికులు ఆర్థికంగా చితికిపోయారు. తర్వాత అరకొర నిధులతో వీవర్స్ వెల్ఫేర్ ప్యాకేజీ అంటూ హడావుడి చేసి చేనేత రంగ అభివృద్ధిపై దెబ్బకొట్టింది. వర్షాకాలంలో పరిశ్రమకు అంతరాయం కలుగుతున్నందున ఆ కాలానికి రూ.4 వేలు చెల్లించడం, వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్య బీమా, చేనేత కార్మికులకు ఇళ్లు, షెడ్లు, పట్టణాల్లో జీ+3 భవనాలు అంటూ దాదాపు 18 జీఓలు జారీ చేసింది. ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.

జిల్లా వ్యాప్తంగా ఐదు విడతల్లో నేతన్న నేస్తం వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	మంజూరైన నిధులు (కోట్లలో)
2019-20	199	రూ.0.47
2020-21	217	రూ.0.52
2021-22	153	రూ.0.36
2022-23	166	రూ.0.39
2023-24	194	రూ.0.46
మొత్తం		రూ.2.20 కోట్లు

వృత్తిని మెరుగుపరచుకున్నా..



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద అందిన ఆర్థిక సాయంతో వృత్తిని మెరుగుపరచుకున్నా. చాలీచాలని ఆదాయంతో సతమతమయ్యే సమయంలో ఈ పథకం ఎంతో ఉపయోగపడింది. గతంలో నాలుగుగేళ్లలో రూ.96 వేలు నాకు అందింది. ఈ సాయంతో లిఫ్టింగ్ యంత్రం కొనుగోలు చేసుకున్నా. ఇదివరకు చీర నేయడానికి 5 రోజులు పట్టేది. ప్రస్తుతం 3 రోజుల్లో చీర నేయడం పూర్తవుతోంది. వర్క్ షెడ్లు పెట్టుకోవడానికి కూడా దరఖాస్తు చేసుకున్నా.

– బాలాజి, చేనేత యూనియన్ జనరల్ సెక్రటరీ, చిత్తూరు జిల్లా

జక్కార్డ్ కొనుక్కున్నా..



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24 వేలు అందించడం నాకు ఎంతో సహకారంగా ఉంది. నేత మగ్గాన్ని విడిచి ఇతర పనుల్లోకి వెళ్దామనుకున్న దశలో ఈ పథకం అండగా నిలిచింది. ఇప్పటివరకు రూ.96 వేలు నాకు అందింది. నేతలో నూతన డిజైన్ల కోసం నూతన జక్కార్డ్ కొనుకున్నా. నేతకు కావలసిన ముడిసరుకులు, సామగ్రి కొనుగోలు చేసుకున్నా. ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

–లత, నేతన్న నేస్తం లబ్ధిదారు, మాంగాడు, నగరి మండలం

కొత్త డిజైన్లతో నేస్తున్నా..



ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హతే ఆధారంగా నాకు నేతన్ననేస్తం పథకం కింద ఆర్థికసాయం అందుతోంది. నూలు తెచ్చుకోలేని దుస్థితిలో ఉన్న నాకు ఈ సాయం ఎంతో ఆదుకుంది. ప్రస్తుతం నేను వృత్తిలో నిలదొక్కుకోవడంతో పాటు కొత్త డిజైన్లు ఇచ్చే పనిముట్లు బాబిన్లు కొనుగోలు చేసుకున్నా. కొత్త డిజైన్లతో ఖరీఫ్‌లు నేస్తున్నా. ఫెడల్‌లూమ్ కోసం దరఖాస్తు చేసుకున్నా.

– కస్తూరి, నేతన్న నేస్తం లబ్ధిదారు, మాంగాడు, నగరి మండలం

చేనేత కనుమరుగయ్యేది..



కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగానికి నేతన్న నేస్తం ఊపిరి పోసింది. ఈ పథకం లేకుంటే చేనేత కనుమరుగయ్యేది. అలాంటిది నేడు చేనేతలు మళ్లీ వారి వృత్తిని కొనసాగిస్తున్నారు. నాకు ఇప్పటి వరకు రూ.96వేలు సాయం అందగా కొత్తరకం బాబిన్లు, డిజైన్లు ఇచ్చే జక్కార్డులు కొన్నాను. ఈసారి విద్యుత్ సాయంతో నడిచే ఫెడల్ యంత్రాలు కొనుగోలు చేస్తా.

– జానకిరాముడు, నేతన్న నేస్తం లబ్ధిదారు, మాంగాడు, నగరి మండలం

అర్హులకు పథకాలు అందించడమే లక్ష్యం



జగనన్న సురక్షలో భాగంగా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీప

నింద్ర: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష పథకం ఉద్దేశమని ఎంపీపీ దీప అన్నారు. గురువారం మండలంలో మేళంబాకం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అన్ని సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ప్రజలకు కావలసిన 11 రకాల సేవలు, సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందన్నారు. వలంటీర్లు గడప గడపకు వెళ్లి ప్రజలకు ఎటువంటి సౌకర్యాలు కావాలో అడిగి తెలుసుకుని వారికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ అమరేంద్రబాబు, సచివాలయ ప్రత్యేకాధికారి సురేష్‌కుమార్, సర్పంచ్ బాలకృష్ణంరాజు, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, నాయకులు వేణురాజు, సత్యరాజ్, మురళి, వీరయ్య పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

పుత్తూరు రూరల్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి గురువారం సాయంత్రం పట్టణంలో హల్‌చల్ చేశాడు. అంబేడ్కర్ విగ్రహంపైకి ఎక్కి నానాయాగీ చేశాడు. నగరం రోడ్డు సర్కిల్ వద్ద గల ఆటోస్టాండ్‌లోని 5 ఆటోల అద్దాలు పగులగొట్టాడు. ఆటో డ్రైవర్లు ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణంలో పూసలు అమ్ముకునే వారు స్టేషన్‌కు వచ్చి తమ కుటుంబానికి చెందిన వ్యక్తేనని, మతిస్థిమితం లేక ఇలా ప్రవర్తిస్తుంటాడని పోలీసులకు వివరణ ఇచ్చి వెంట తీసుకెళ్లారు.

సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో అధికారులు, నాయకులు



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

పాలసముద్రం: ప్రజల అర్హతలు, అవసరాలు తెలుసుకుని వాటిని సకాలంలో సమకూర్చడానికే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకాన్ని తీసుకొచ్చిందని పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. గురువారం నరసింహపురం గ్రామ సచివాలయ పరిధిలో మండల ప్రత్యేక అధికారి మహబూబ్‌బాషా, ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్, తహసీల్దార్ బాబు సమక్షంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 11 రకాల ధ్రువీకరణ పత్రాలు లబ్ధిదారులకు అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం మహిళలు సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం మహిళలు చేశారు. కార్యక్రమంలో ఏఓ డిల్లీప్రసాద్, ఐకేపీ ఏపీఎం ఫరీద్‌మస్తాన్, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గోపినాథ్

కార్వేటినగరం: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అన్నారు. గురువారం స్థానిక వెలుగు సమావేశ భవనంలో ఆరోగ్యసిబ్బంది, ఆశా వర్కర్లకు సీజనల్ వ్యాధుల నివారణకు(ఐఎంఐ ఇన్సెంటివ్ మిషన్ ఇంద్రధనస్సు) చేపట్టాల్సిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి వ్యాధి నిరోధక టీకాలు వేసుకోని పిల్లలు, గర్భిణులను గుర్తించి సంపూర్ణ వ్యాధి నిరోధక టీకాలు వేయించే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది. ఆశా వర్కర్లు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



వృద్ధులకు దిండ్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న బ్యాంక్ ఆఫ్ బరోడా సిబ్బంది

కార్వేటినగరం: పుత్తూరు పట్టణంలోని బ్యాంకు ఆఫ్ బరోడా బ్యాంకు 116వ వార్షికోత్సవాన్ని గురువారం కార్వేటినగరం వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఎల్లప్ప మాట్లాడుతూ బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకును ప్రారంభించి 116 ఏళ్లు గడిచిందని, నిత్యం ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. సిబ్బంది అందించే సేవలతోనే 116 ఏళ్లను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వృద్ధులకు తల దిండ్లు, ప్లేట్లు, గ్లాసులతో పాటు, స్వీట్లు పంపిణీ చేసి వృద్ధుల సమక్షంలో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాము, సిబ్బంది, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పలువురు పాల్గొన్నారు.

ఒకరికి ఒకరు తోడుగా నిలవాలి

- విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి గురురాజారావు



సన్మానం అందుకున్న విశ్రాంత ఉద్యోగులు

పుత్తూరు రూరల్: ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఒకరికి ఒకరు తోడుగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్(ఏపీ ఆర్‌సీఆర్‌ఈ) రాష్ట్ర కార్యదర్శి వి.గురురాజారావు పిలుపునిచ్చారు. గురువారం పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల భవనంలో 75 ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగుల సన్మాన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల నుంచి రిటైర్డ్ అయ్యామని నిరుత్సాహ పడకుండా, వృద్ధాప్యం పైన పడిందని బాధపడకుండా తరచూ పలు సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 315 విశ్రాంత ఉద్యోగ సంఘాల్లో 3 లక్షలకు పైగా సభ్యులు ఉన్నారని తెలిపారు. ప్రతి జిల్లా సంఘంతో ప్రతి ట్రెజరీ పరిధిలోని సంఘాలు సమన్వయం చేసుకుంటూ ఒకరి ఒకరు సహకరించుకోవాలని సూచించారు. పెన్షన్ పొందడంలో ఏవైనా సమస్యలు ఎదురైతే సంఘటితంగా పరిష్కరించుకోవాలని కోరారు. అనంతరం కొటక్ మహీంద్రా ఇన్సూరెన్స్ కంపెనీ తిరుపతి వారి సౌజన్యంతో 30 మంది విశ్రాంత ఉద్యోగులకు సన్మానం జరిగింది. కార్యక్రమంలో పుత్తూరు సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు, జిల్లా అధ్యక్షుడు శంకర్, నాయకులు యుగంధర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, కృపావరమ్మ, రామచంద్రరాజు, అరుణాచల్‌రెడ్డి, కుప్పయ్య, వర్మ, రామ్మూర్తిరాజు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఊమెన్ చాందీకి నివాళులు



ఊమెన్‌చాందీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నగరి: కేరళ మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ ఊమెన్ చాందీ మృతి చెందిన విషయం విదితమే. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఊమెన్ చాందీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. పార్టీ ఉన్నతికి ఆయన చేసిన సేవలను ఏఐసీసీ మెంబరు, మాజీ చైర్మన్ భానుమూర్తి కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో పీసీసీ మెంబరు నటరాజ మొదలియార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబు, పీసీసీ జనరల్ సెక్రెటరీ గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూతబడిన చక్కెర ఫ్యాక్టరీని తెరిపించండి



నింద్ర నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ నిరసన తెలుపుతున్న జిల్లా రైతుసంఘం నాయకులు

నింద్ర: మండలకేంద్రం నింద్రలో మూతబడిన నేతమ్స్ షుగర్ పరిశ్రమను తక్షణమే తెరిపించి, రైతులకు చెల్లించాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఫ్యాక్టరీ ఎదుట ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఆరు చక్కెర కర్మాగారాలు ఉండగా, కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే నడుస్తోందని, దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జిల్లాలో మయూరి షుగర్ ఫ్యాక్టరీ, నేతమ్స్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు రైతులకు బకాయిలు చెల్లించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. రైతులు ఎంతో కష్టపడి అప్పులు చేసి సాగు చేసిన చెరుకును ఫ్యాక్టరీకి సరఫరా చేస్తే వారికి బకాయిలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఫ్యాక్టరీ యాజమాన్యాలు స్పందించి రైతులకు బకాయిలు చెల్లించాలని, లేదంటే త్వరలో నేతమ్స్ ఫ్యాక్టరీ వద్ద తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరవధిక ధర్నా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, మునిశంకర్, మురుగేష్, కుమార్, రైతులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన సంక్షేమ పాలన





చిన్నకొమరగుంటలో పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

- అర్హులందరికీ పథకాలు అందాలి
- అభివృద్ధే ప్రధాన ధ్యేయం
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: జనం మెచ్చిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వం.. కులం లేదు.. మతం లేదు.. పార్టీలు లేదు.. ఎలాంటి వర్గవైషమ్యాలకు తావివ్వకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాలు అందాలన్నదే సీఎం జగనన్న ఆశయమని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. గురువారం మండలంలోని కొమరగుంట గ్రామ సచివాలయ పరిధిలోని చిన్నకొమరగుంట, పెద్దకొమరగుంట, కొమరగుంట దళితవాడ, సద్దికూళ్లపల్లె, సద్దికూళ్లపల్లె ఆదిఆంధ్రవాడ, గోవిందవారిపల్లె, బందార్లపల్లె, పూలవారికండ్రిగ, ఎస్టీ కాలనీ గ్రామాల్లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల లబ్ధి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిన్నకొమరగుంటలో పద్మావతి ఆండాల్ సమేత వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, సమస్యలను విన్న మంత్రి సత్వరమే పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులో భాగంగా గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు.

అభివృద్ధే ధ్యేయం..

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క గ్రామంలో కూడా సిమెంటు రోడ్డు లేదనే మాట వినిపించకూడదన్నారు. అవసరమైన నిధులు తీసుకొస్తానని పనులను వెంటనే చేపట్టాలన్నారు. నాయకులు, అధికారుల సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. శ్మశానాలు లేని గ్రామాలను గుర్తించి వెంటనే శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సత్యనారాయణను ఆదేశించారు. అదేవిధంగా అర్హత ఉన్న వారికి ఇంటి స్థలాలు మంజూరు చేయాలన్నారు. కొమరగుంట దళితవాడలో ఇళ్లు లేనివారిని గుర్తించి వారు కోరుకున్న చోట ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇప్పటికీ అర్హత ఉండి ఎలాంటి పథకాలు పొందలేని వారిని గుర్తించి వారికి పథకాలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, ఎంపీటీసీలు మునీంద్రరెడ్డి, గుణశేఖర్, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, సర్పంచ్‌లు దాక్షాయణి, మమత, గోవిందయ్య, ఎంపీడీఓ సుధాకరరావు, పీఆర్ డీఈ దయాకర్‌రెడ్డి, ఏఈ మురళి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండి గోవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీలు అరుణ, పురుషోత్తం, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ భీమశంకర్ రెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ధనంజయ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, రోశిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు జగదీశ్‌రెడ్డి, వెంకటేశ్, నరేష్‌రెడ్డి, బూత్‌కమిటీ కన్వీనర్ కేశవులు రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిస్సహాయులకు అండగా జగనన్న సురక్ష



నగరి: సర్టిఫికెట్లు అందుకున్న వారితో మంత్రి ఆర్‌కే రోజా

- ప్రజల అవసరాలను గుర్తించిన ఏకైక నాయకుడు సీఎం జగనన్న
- మంత్రి ఆర్‌కే రోజా

నగరి: నిస్సహాయులకు అండగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలుస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఇందుకు సహకరిస్తున్న అధికార యంత్రాంగాన్ని అభినందించారు. మున్సిపల్ పరిధిలోని సత్రవాడ, కరకంతాపురం సచివాలయ పరిధిలో, అలాగే వడమాలపేట మండలం అప్పలాయగుంట సచివాలయ పరిధిలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ఎవరైనా ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలిపోతే జగనన్న సురక్షలో భాగంగా గుర్తించి న్యాయం చేస్తామన్నారు. కావాల్సిన ధ్రువీకరణ పత్రాలను ఉచితంగానే అందిస్తున్నామని చెప్పారు. పరిపాలనలో సమూల మార్పులు తీసుకొచ్చామన్నారు. విద్య, వైద్య రంగాలు అనూహ్యంగా అభివృద్ధి చెందాయన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకుని అందుకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. దేశంలోనే జగనన్న పాలన ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సమర్థవంతమైన నాయకత్వానికి అండగా మీరంతా నిలబడి గెలిపించడం వల్లే పాలనలో అనేక సంస్కరణలు సాధ్యమైందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారు, ప్రస్తుతం జగనన్న ఎన్ని నెరవేర్చారో బేరీజు వేసుకుంటే ఏ పాలన ప్రజల కోసం ఉందో స్పష్టమవుతుందన్నారు. సచివాలయాల పరిధిలో 608 సర్టిఫికేట్లను లబ్దిదారులకు ఆమె అందించారు. తమిళ, తెలుగు భాషల వారు సమపాళ్లలో ఉన్న సచివాలయం కావడంతో రెండు భాషల్లోనూ అనర్గళంగా ఆమె మాట్లాడడం ప్రత్యేకతను సంతరించుకుంది. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్‌చైర్మన్ బాలన్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, సీడీపీఓ కృష్ణవేణి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ దయానిధి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, జిల్లా నేత అనుబంధ సంఘ అధ్యక్షుడు కన్నాయిరం, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు బీఆర్వీ అయ్యప్పన్, కౌన్సిలర్లు వెన్నెల, చిన్నపాప, మురుగ, ఇంద్రారెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎల్లప్పరెడ్డి, వడమాలపేట తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ భానుమూర్తి, నాయకులు కరుణాకర్ చౌదరి, సురేష్‌రాజు, నందయ్య పాల్గొన్నారు.



వడమాలపేట: సర్టిఫికెట్లు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా